

పచ్చని **చిలుకలు** తోడుంటే..

మహబూబ్‌నగర్ బస్టాండ్ ఆవరణలోని రావి చెట్టుపై రామ చిలుకలు కనువిందు చేస్తున్నాయి. మోడుబారిన చెట్టును ఆవాసంగా మార్చుకున్నాయి. ఉదయం ఆహారం కోసం వేటకు వెళ్లే చిలుకలు సాయంత్రం కాగానే గూటికి చేరుకుంటున్నాయి. దీంతో ఆకులు రాలి మోడువారిన చెట్టు కొమ్మకు ఆకులుగా మారి సరికొత్త అందాలను సంతరించుకుంటున్నది. ఈ దృశ్యాన్ని 'నమస్తే' ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో బంధించారు.

– బందిగె గోపి, ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

## ఆరురోజుల్లో పెండ్లి.. అంతలోనే ఆత్మహత్య

- యువకుడి మృతితో శెట్టిఆత్మకూరులో విషాదం

గద్వాల రూరల్, ఏప్రిల్ 18 : మరో ఆరు రోజుల్లో పెళ్లి ఉండగా అంతలోనే ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శెట్టి ఆత్మకూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు శెట్టి ఆత్మకూర్‌కు చెందిన గుంటిపల్లి అంజిలన్న, లక్ష్మమ్మ కుమారుడు గుంటిపల్లి నవీన్(24) మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యే అదే మండలానికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చయం కాగా ఈనెల 24వ తేదీన వివాహం చే యాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అందుకోసం కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పనులు చేసుకుంటూ సంతోషంగా చురుకుగా ఉన్న నవీన్ బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి వచ్చాడు. రాత్రి వాళ్ల చిన్నాన్న ఇంట్లో భోజనం చేసి అక్కడే నిద్రపోయాడు. తెల్లవారు జామున ఇంటి నుంచి బహిర్భూమికి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఉదయం అటుగా వెళ్లిన వారు చూసి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పెళ్లిపీటలు ఎక్కాల్సిన కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లి దండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలిచివేశాయి. విషయం తెలుసుకున్న రూరల్ స్టేషన్ పోలీసులు గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. యువకుడి ఆత్మహత్యతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నవీన్(ఫైల్)

## పిచ్చి కుక్క దాడి

- నలుగురి పరిస్థితి విషమం



కుక్క దాడిలో గాయపడిన పల్లెమోని నాగన్న

మూసాపేట, ఏప్రిల్ 18 : మండలంలోని నిజాలాపూర్‌లో ఓ పిచ్చికుక్క నలుగురిపై దాడి చేయగా పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా దవాఖానకు తరలించిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. వివరాలల్లోకి వెళ్తే.. గ్రామంలోని పాఠశాల వద్ద ఉన్న మూడేండ్ల అభినంద్, భానుప్రకాశ్(9) మానస అనే బాలికపై పిచ్చి కుక్క ఎగబడి విచక్షణా రహితంగా కరుస్తున్న సమయంలో అటు వైపు వచ్చిన పల్లెమోని నాగన్న ఆ పిచ్చి కుక్కను బెదిరించి పిల్లలను కాపాడేందుకు వెళ్లాడు. దీంతో పిల్లలను వదిలి కుక్క దూరంగా వెళ్లింది. తిరిగివస్తున్న నాగన్నపై వెనుక వైపు నుంచి దాడి చేసి భుజం, చేతులపై కరిచింది. చెయ్యి పట్టుకొని వదలక పోవడంతో స్థానికులు కుక్క నోట్లో కట్టె పెట్టి చెయ్యిని బయటకు తీశారు. మళ్లీ ఇతరులపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో ఆ కుక్కను కొట్టి చంపారు. గాయాలైన ముగ్గురు చిన్నారులను జానంపేట దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ షబానాబేగం జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. అయితే పిల్లలను కాపాడిన నాగన్న దవాఖానకు ఆలస్యంగా వచ్చాడు. దీంతో అతడి పరిస్థితి మరింత విషమంగా ఉందని వైద్యురాలు వెంటనే 108లో జిల్లా దవాఖానకు తరలించారు.

## కీచక ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బిజినేపల్లి, ఏప్రిల్ 18 : ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసిన ఘటన బిజినేపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాసయ్య స్థానికంగానే నివాసం ఉంటున్నాడు. అదే కాలనీకి చెందిన మానసిక స్థితి సరిగా లేని యువతితో ఆయన మూడు నాలుగు రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. అయితే సదరు యువతి ప్రవర్తనలో వచ్చిన మార్పుపై అనుమానం రావడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా ఆ యువతి ఉపాధ్యాయుడి విషయం చెప్పింది. వెంటనే వారు ఉపాధ్యాయుడు మాసన్నపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి వెల్లడించారు. అయితే రిటైర్‌మెంట్ వయసులో ఇదే పాడు బుద్ధని ఉపాధ్యాయుడి చర్యపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.




మందిపల్లి వద్ద రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న జేసీబీ

## మరికల్‌లో భారీ వర్షం


మరికల్, ఏప్రిల్ 18: మరికల్, ధన్వాడ మండలాల్లో గురువారం సాయంత్రం నుంచి 7గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో ధన్వాడ మండలంలోని మందిపల్లి వద్ద చెట్లు రోడ్డుపై పడడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌జామ్ అయ్యింది. ఆకస్మికంగా గాలులు, ఉరుములతో భారీ వర్షం కురవడంతో అక్కడక్కడ చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది.

## వడదెబ్బతో వృద్ధురాలి మృతి

ధరూరు, ఏప్రిల్ 18 : వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దోర్నాల గ్రామానికి చెందిన కావలి వెంకటమ్మ(64) మండలకేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం వద్ద పండ్లు అమ్మకుంటూ జీవనం సాగించేది. బుధవారం ఆమె వడదెబ్బకు గురై మృతి చెందింది. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.




మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి బీఫాం అందజేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల




నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బీఫాం అందజేస్తున్న గులాబీ బాస్ కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గువ్వల, మాజీ ఎమ్మెల్యేలు మర్రి, జైపాల్‌యాదవ్

## కారు.. టాప్ గేరు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు బీఫాంలు అందించిన గులాబీ బాస్ కేసీఆర్
- ప్రచారంలో దూసుకెళ్లనున్న గులాబీ నేతలు

సార్వత్రిక ఎన్నికల సమరంలో గులాబీ పార్టీ దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్ల నుంచి బీఆర్ఎస్ తరపున రేసులో ఉన్న అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు పార్టీ అధినేత కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఫాంలు అందించారు. అనంతరం రెండు పార్లమెంట్ స్థానాలను బీఆర్ఎస్ గెలిచి తీరాలని గులాబీ బాస్ ఆదేశించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాల వారీగా సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలతోపాటు మాజీ ఎమ్మెల్యేలు సమన్వయ సమావేశాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రచా ర పర్వాన్ని ప్రారంభించారు. గ్రామాల వారీగా కమిటీలు వేసి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను కలిసేందుకు బీఆర్ఎస్ పక్కా స్కెచ్ వేసింది.

# ముహూర్తం చూసుకొని..

- పాలమూరులో 16,80,417 మంది, నాగర్‌కర్నూల్‌లో 17,34,773 మంది ఓటర్లు
- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పరిధిలో నామినేషన్లు షురూ
- బీజేపీ నుంచి అరుణ, భరత్, కాంగ్రెస్ నుంచి మల్లు రవి, స్వతంత్ర అభ్యర్థి దాఖలు

## మొదటిరోజు నాలుగు నామినేషన్లు దాఖలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సార్వత్రిక సమరం మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రవినాయక్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి రోజు రెండు సెగ్మెంట్ల పరిధిలో నలుగురు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పాలమూరు నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ ఇంతియాజ్, నాగర్‌కర్నూల్ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, బీజేపీ అభ్యర్థి భరత్ నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం మొదలైంది. కాగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,80,417, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,34,773 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకొని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి స్థాయిలో.. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేసింది.

***తొలి రోజు..***

తొలిరోజే ఆయా పార్టీల అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లను దాఖలు చేశారు. పాలమూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా డీకే.అరుణ, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ ఇంతియాజ్, కందనూలు నుంచి బీజేపీ అభ్యర్థిగా భరత్, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లురవి నామపత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆయా కలెక్టరేట్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియాను సైతం రానివ్వలేదు. అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించారు. వాహనాలను వంద మీటర్ల దూరంలోనే నిలిపివేశారు.

### నేటి 'వంశీ' నామినేషన్‌కు హాజరుకానున్న సీఎం

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంపై అధికార కాంగ్రెస్ పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. మరో వైపు సీఎం ఇలాఖాలో కాంగ్రెస్‌ను ఎలాగైనా ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ గట్టి పోటీనిస్తున్నాయి. దీంతో పాలమూరు పోరు ప్రతిష్టాత్మకంగా మారింది. కాగా ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్న హస్తం పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, సీఎం రేవంత్ ఇద్దరూ కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన వారే. దీంతో శుక్రవారం వంశీ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ నుంచి ర్యాలీ నిర్వహించి 11 గంటల వరకు క్లాక్‌టవర్‌కు చేరుకోనున్నది. అక్కడ కార్నర్ మీటింగ్‌లో ఎన్నికల ప్రచారాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని రిటర్నింగ్ అధికారికి వంశీ నామినేషన్ అందజేయనున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరూ భారీ ఎత్తున జన సమీకరణ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### బీజేపీ ర్యాలీ అట్టర్‌ఫ్లాప్

మహబూబ్‌నగర్‌లో పార్లమెంట్ స్థానానికి డీకే అరుణ నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న క్రమంలో ఏర్పాటు చేసిన ర్యాలీ అట్టర్‌ఫ్లాప్ అయింది. తొలిరోజే నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ కార్యకర్తలు ఎవరూ పెద్దగా స్పందించి హాజరుకాలేదు. దీంతో ఆ పార్టీ నేతలు ఖంగుతిన్నారు. భగీరథ కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీకి వేల సంఖ్యలో కార్యకర్తలు వస్తారని ఆశించినా వందల సంఖ్యలో కూడా రాకపోవడంతో నిరాశే మిగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఒక్కరే హాజరయ్యారు. సెగ్మెంట్ పరిధిలోని ముఖ్య నేతలు ఎవరూ హాజరుకాలేదు.





మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్, కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి

# గన్నీ గోస

యాసంగిలో సాగుచేసిన వరి పంటలు కోతకొచ్చాయి. నూర్పిడి పనుల్లో అన్నదాతలు బిజీగా ఉండగా కొనుగోలు చేయాల్సిన అధికారులు మాత్రం సంసిద్ధత చూపడం లేదు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కేవలం ప్రకటనకే పరిమితం కావడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు లేకపోవడంతో అప్పుడొస్తాయ్.. ఇప్పుడొస్తాయ్ అంటూ అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. అంత అవసరమైతే మిల్లుల నుంచి బస్తాలు తెచ్చుకోవాలని రైతులకు ఉచిత సలహాలిస్తున్నారు. గన్నీ బ్యాగుల కొరతతో కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి.

- కల్వకుర్తి, ఏప్రిల్ 18

- మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- గన్నీ బ్యాగులు లేకపోవడంతో నిలిచిన తూకాలు
- సంచుల కోసం మిల్లర్ల వద్దకు వెళ్లాలని అధికారుల సలహాలు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న కర్షకులు
- తేమ, తరుగు పేరుతో నిలువుదోపిడీ
- రూ.2వేల వరకు మాత్రమే చెల్లిస్తున్న వైనం
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



కల్లాల్లోనే ఉన్న ధాన్యపు రాశి



కల్లాల్లోనే ఆరబోసిన ధాన్యం

బీఆర్ఎస్ సర్కారు హయాంలో కేంద్రం మోకాలడ్డుతున్నా.. ధాన్యం కొనుగోలు విషయంలో సీఎం కేసీఆర్ వెనుకడుగు వేయలేదు. గత యాసంగిలో రైతులు సాగుచేసిన ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. పంట కోతకొచ్చే సమయానికి ముందే ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేసేవారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ బ్యాగులు సమకూర్చడం, ధాన్యం నిల్వ గోదాంలు వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ఉండేది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీ, మండల మహిళా సమాఖ్యలు, మెప్మా, వ్యవసాయ మార్కెట్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు.

***ఉమ్మడి జిల్లా యూనిట్‌గా..***

గత ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను యూనిట్‌గా తీసుకొని ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసేవారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 220, మహబూబ్‌నగర్ జిల్లాలో 192, జోగుళాంబ గద్వాల జిల్లాలో 74, వనపర్తి జిల్లాలో 250 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

***20 రోజులు కావచ్చినా..***

ధాన్యం దిగుబడి ప్రారంభమై దాదాపు 20 రోజులు కావస్తుంది. ఇప్పటి వరకు గన్నీ బ్యాగుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. యాసంగిలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వీలైనంత త్వరగా పంటను అమ్ముకునేందుకు సంసిద్ధమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు ధర రూ.2,260, బీ గ్రేడ్‌కు రూ.2,240 చెల్లిస్తున్నారు. కానీ, గన్నీ బ్యాగుల కొరతతో రైతులు ప్రైవేట్ వ్యా పారులను ఆశ్రయించడంతో ఇదే అదునుగా భావించి నిలువు దోపిడీ చేస్తున్నారు. తరుగు, తేమ పేరుతో క్వింటాకు 5 నుంచి 6 కిలోల వరకు కోత పెడుతున్నారు. ధర కూడా రూ.1,800 నుంచి రూ.2వేల వరకు మాత్రమే నిర్ణయిస్తున్నారు. ఇదేంటని అడిగితే ఇష్టం ఉంటే అమ్మండి లేకుంటే వెళ్లండి అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని రైతుల ఆవేదన వ్యక్తం చేసున్నారు.

***తగ్గిన దిగుబడి..***

గతేడాది యాసంగితో పోల్చితే ఈసారి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గినట్లు తెలుస్తున్నది. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో నవంబర్ నాటికే ప్రాజెక్టుల నుంచి సాగునీరు నిలిచిపోయాయి. గతేడాది దిగుబడితో పోలిస్తే ఈసారి 60 శాతానికి మించకపోవచ్చని అధికారుల అంచనా. కాగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 500 బోనస్‌తో కలిపి ధాన్యం కొనుగోలు చేస్తే బాగుంటుందని అన్నదాతలు కోరుతున్నారు. కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్‌ను నమ్మి నట్టేట మునిగామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### గన్నీ బ్యాగులుంటేనే కొనుగోళ్లు..

కల్వకుర్తి పీఏసీసీఎస్ పరిధిలో 24 కేంద్రాలను ప్రారంభించాం. కానీ గన్నీ బ్యాగులు ఉంటేనే కొనుగోలు సాధ్యమవుతుంది. అధికారులను అడిగితే వస్తాయి అంటున్నారు తప్పా ఎప్పుడొస్తాయో చెప్పడం లేదు. రైస్ మిల్లుల వద్ద తీసుకోండని అధికారులు ఉచిత సలహాలిస్తున్నారు. పోనీ వాళ్ల వద్దే తీసుకుందామన్నా అవి చినిగిపోయాయి. రైతులు ప్రతి రోజూ ఫోన్ చేసి ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారని అడుగుతున్నారు. వారికి ఏం చెప్పాలో అర్థం కావడం లేదు.

- తలసాని జనార్దన్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్, కల్వకుర్తి